మోసం చేయడం చంద్రబాబు నైజం

- 14 నెలలైనా హామీలు అమలు చేయరా?
- పథకాలు అమలు చేసేదాక పోరాటం
- రామాపురం మండలంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ
- వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ హిందూపురం పరిశీలకులు రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి



వడ్డెపల్లెలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు

రామాపురం(రాయచోటి జగదాంబసెంటర్) : మోసం చేయడం చంద్రబాబు నైజమని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామాపురం మండలం గోపగుడిపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై నిర్వహించిన రచ్చబండ సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ హిందూపురం పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ గడికోట జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాసన వెంకటరమణ, సర్పంచ్ ముంగర సరోజమ్మ, సుబ్బయ్య, రేకం నారాయణ, వైఎస్‌ఆర్‌సీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. సమావేశం అనంతరం గ్రామంలో పర్యటించారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంపై ప్రజల మొబైల్ ఫోన్‌లలో క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేయించి, స్కాన్ చేపించి కూటమి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, అదే విధంగా ఎన్నికలకు ముందు చంద్రబాబు, కూటమి నేతలు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలకు తెలియజేశారు. ప్రజా సంక్షేమం ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యపడుతుందన్నారు. గత ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంలా భావించి హామీలన్నింటిని అమలు చేయగా, నేడు చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో అమలుపై దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు త్రికరణ శుద్ధితో సంతకాలు చేసి బాండ్లను ప్రజలకు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటుతున్నా బాండ్లలో పేర్కొన్న ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. గోపగుడిపల్లె గ్రామానికి తన హయాంలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, బోర్లు తదితర అభివృద్ధి పనులు చేశానని ఆయన గుర్తు చేశారు. హిందూపురం వైఎస్‌ఆర్‌సీపీ పరిశీలకులు రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను చూస్తే రాజ్యాంగం, అబ్దుల్ కలాంను చూస్తే రాకెట్లు, ఉపగ్రహాలు స్మరణకు వచ్చినట్లు చంద్రబాబును చూస్తే దగా, నయవంచన, మోసం గుర్తుకు వస్తాయన్నారు. ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు బనాయించి పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. బాబు మోసాలను ప్రతి గడపకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు.

కూటమి హామీలన్నీ గాలి కబుర్లే

నూతన పెన్షన్ రాలేదని వృద్ధులు, ఉద్యోగం కానీ.. నిరుద్యోగభృతి రూ.3 వేలు ఇవ్వలేదని నిరుద్యోగులు, 50 ఏళ్లకే పెన్షన్ అని చెప్పి మోసగించారంటూ బడుగు, బలహీన వర్గాలు, రెండవ ఏడాది ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా అందివ్వలేదని రైతన్నలు తమ గోడును శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డిల ఎదుట గోపగుడిపల్లె గ్రామ ప్రజలు తెలియజేసుకున్నారు. పంటలు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోతున్నామని, పాడిపై ఆధారపడి జీవిస్తుంటే అందుకు కూడా మద్దతు ధర లభించడంలేదని వాపోయారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన బ్యాగులు, మధ్యాహ్న భోజనం అందేదని, కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన స్కూల్ బ్యాగులు నెలలోపే చిరిగిపోయాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు. గత జగన్ ప్రభుత్వం ఇంటికే వచ్చి అన్ని సంక్షేమ పథకాలను అందించేదని, చంద్రబాబు మోసపు మాటలు నమ్మి మోసపోయామంటూ ఆ ప్రాంత ప్రజలు నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కాగా అంతకుముందు గ్రామానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులకు కార్యకర్తలు, ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం వారు కసిరెడ్డిగారి పల్లె, గువ్వలచెరువు గ్రామాల వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మమేకమయ్యారు. బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ – రీకాలింగ్ చంద్రబాబు చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాజా, మాజీ సర్పంచ్ బసయ్య, ఉపసర్పంచ్ బాబు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు రఘు, వెంకటరెడ్డి, మౌలా, జిలాన్, ఆర్‌ఎంపీ రమణ, ఆయూబ్, సూరం వెంకటసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, సగినాల శివశంకర్, సిరాజ్, మల్లయ్య, నాగబసయ్య, బలరాం, బాబు, ప్రసాద్, శ్రీను, రామాంజులు, సత్యనారాయణ, సూరపు అచ్చిరాజు, చెంద్రాయుడు, శ్రీరాములు, లవకుమార్, చెంచయ్య, తిరుమలయ్య, రాఘవ, రమణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికకు పటిష్ట బందోబస్తు



టి.బాబు, సీఐ, ఒంటిమిట్ట

ఒంటిమిట్ట : వైఎస్సార్ కడప జిల్లాలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణకు సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 12న జరిగే ఒంటిమిట్ట మండల జెడ్పీటీసీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం సీఐ టి.బాబు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా మండలంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, ఒక్క ప్రాంతంలో ఎస్‌ఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జ్‌గా వేస్తున్నామని తెలియజేశారు. అక్కడ ముందు నుంచే నిఘా ఉంచి ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేలా అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు వెళతామని చెప్పారు. 30 పోలింగ్ బూత్‌లు ఉండగా బూత్‌కు ఇద్దరు పోలీసులు ఉంటారని, మొత్తం 80 మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సహకరించాలని కోరారు. కాగా 30వ తేదీ నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తుండగా, 12న పోలింగ్, 14న ఫలితాలు ప్రకటించనున్నారు. ఒంటిమిట్ట మండలం నుంచి జెడ్పీటీసీగా ఎన్నికైన ఆకేపాటి అమరనాథరెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నుంచి శాసనసభ్యులుగా గెలవడంతో జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికల అనివార్యమైంది.

క్లుప్తంగా

పని కల్పించండి.. సారూ

గాలివీడు : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పని కల్పించడం లేదంటూ గోరాన్‌చెరువు గ్రామానికి చెందిన అవుల సుశీలమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలసి తనకు 100 రోజులు పని కల్పించామని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పలుమార్లు మండలంలోని ఉపాధి హామీ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లను పలుమార్లు పని కల్పించాల్సిందిగా కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



గ్రామంలో ఊరేగుతున్న దేవతామూర్తులు

చిట్వేలి : పాత చిట్వేలిలో వెలసి ఉన్న శ్రీ వరద రాజస్వామి ఆలయంలో రెండవరోజు సోమవారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రాతఃకాల పూజలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు సర్వతో భద్ర మండల ఆరాధన, మండల ఆరాధన, ప్రధాన కలశస్థాపన, చతుష్టాన అర్చన, ద్వారపూజ, షోడశ స్తంబపూజ, అనంతరం 11 గంటలకు దేవతా మూర్తుల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వేదశ్వస్తి, మహానైవేద్యం, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం చేశారు. పూజ కార్యక్రమాలను వేదపండితుడు పెద్ద వెంకటనారాయణ శర్మ నిర్వాహకులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

అన్నదానం



ఆహార పొట్లాలు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో మిన్న అని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్యామ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పోలు దేవప్రసాద్‌రెడ్డి ఆర్థికసాయంతో సోమవారం చిత్తూరు మార్గంలో గుడిసెలలో నివసించే పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ షంషీర్ వలీ, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పశుపతినాథునికి పూజలు



సంబేపల్లె : పశుపతినాథా.. చల్లంగా చూడవయ్య అంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ ఆలయంలో నాగపంచమి సందర్భంగా సోమవారం లింగస్వరూపాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్‌కు ఆధ్వర్యంలో హరికథ కాలక్షేపం, అన్నమయ్య సంకీర్తనలతో భక్తులను అలరించారు. అనంతరం వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అనాథ మహిళకు ఆర్థికసాయం

లక్కిరెడ్డిపల్లి : అనాథ అయిన కొనేటి లక్ష్మీదేవికి మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందజేసినట్లు మానవత చైర్మన్ ఏఎస్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి మర్రిచెట్టు దగ్గర జరిగిన యాక్సిడెంట్‌లో ఒక కాలు కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో మానవత సంస్థ డైరెక్టర్ రమణరావును సంప్రదించగా ఆర్థిక సాయం అందజేస్తామని తెలియజేశారు. ఈ విషయంపై నెలవారి సమావేశంలో ప్రస్తావించగా సభ్యులందరూ ఆర్థికసాయం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆర్థికసాయం కింద ఆమెకు మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి చేతులమీదుగా రూ.5 వేలు అందజేశారు.కార్యక్రమంలో సంస్థ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్, ఆరె శివయ్య, ఈవీ కృష్ణ చైతన్య రెడ్డి, షఫీ నాయక్, పక్కీరయ్య, శ్రీరాములు, నరసింహారెడ్డి, బి.శ్రీనివాసులు, రవిశంకర్, రమణయ్య, సాయి చరణ్, శ్రీరాములు పాల్గొన్నారు.

బ్యాలెట్ పేపర్‌తోనే ఎన్నికలు నిర్వహించాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షులు సంగటి మనోహర్ కోరారు. ఈవీఎం వ్యతిరేక జాతీయ ఉద్యమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే బ్యాలెట్ పేపరే ఉండాలన్నారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీన పరచడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ అమీన్‌పీరా, షేక్ హుమేరా, సావంత్ చంద్రకళా భాయి, జేవీ రమణ, కైపు రామాంజనేయులు, సాంబ శివయ్య, దేవర శ్రీకృష్ణ, డీఎం ఓబులేశు యాదవ్, వెంకటశివ, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి స్థలాన్ని అన్యాక్రాంతం నుంచి కాపాడండి



తహసీల్దారుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి

సిద్దవటం : మండలంలోని మధవరం ప్రాథమిక కేంద్రం సిబ్బందికి ఇళ్ల స్థలాలకు కేటాయించిన స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకమార్ సోమవారం తహసీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి, స్టాఫ్ నివాసాల(క్వార్టర్స్) అవసరం నిమిత్తం 1994లో సరిపడా స్థలాన్ని సర్వేనెంబర్ 425/1లో 5.07 ఎకరాలు దాతలు ప్రభుత్వానికి అప్పగించారు. అదే సంవత్సరంలో ఆసుపత్రి భవన నిర్మాణం, ప్రహరీ గోడను 2 ఎకరాల స్థలంలో ఏపీఎంఐడీసీ సహకారంతో నిర్మాణాలు జరిగాయన్నారు. మిగిలిన 3.07 ఎకరాల స్థలం చుట్టూ దురాక్రమణకు గురవుతోందని కావున మండల తహసీల్దారు ఈ స్థలాన్ని సర్వే చేయించి సరిహద్దులను తెలియజేయాలని కోరామన్నారు. ఆసుపత్రి స్థలం అన్యాక్రాంతం కాకుండా కాపాడి ఆసుపత్రికి న్యాయం చేయాలని తహసీల్దారు తిరుమల బాబును విజ్ఞప్తి చేశారు.

మంగంపేట లేఔట్ అభివృద్ధిపై దృష్టి సారించండి



సబ్‌కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గ్రామస్తులు

రాజంపేట : మంగంపేట నూతన లేఔట్ ఆర్అండ్ ఆర్–5 అభివృద్ధిపై దృష్టి సారించాలని వైఎస్సార్ సీపీ రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. సోమవారం అన్నమయ్య సభా భవనంలో సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియా దేవిని గ్రామస్తులతో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగంపేట నూతన లేఔట్‌లో అభివృద్ధి కానరాలేదన్నారు. ఇక్కడి గ్రామస్తులు అసౌకర్యాల నడుమ జీవనాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ లేక నివాసీయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమ్యూనిటీ హాల్, నూతన దేవాలయ నిర్మాణం ఇంతవరకు జరగలేదన్నారు. వీటి నిర్మాణానికి యుద్ధప్రాతిపదకన నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే రేషన్ పంపిణీ వ్యవహారంపై దృష్టి సారించి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు యానాదిరెడ్డి, గల్లా శ్రీనివాసులు, సుద్దాల వెంకటేశ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి – సబ్‌కలెక్టర్

ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి అన్నారు. అన్నమయ్య సభా భవనంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతుల అక్కడక్కడే పరిష్కరించేందుకు ఆమె చర్యలు తీసుకున్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి

వీరబల్లి : కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ ఖాజా బీ సిబ్బందికి తెలిపారు. సోమవారం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ఆరా తీశారు. అర్జీల పరిష్కారంలో యంత్రాంగం ప్రదర్శిస్తున్న అలసత్వాన్ని తప్పుబట్టారు. పనితీరు మెరుగుపరుచుకోకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలంటూ సిబ్బందికి ఆదేశించారు.

ఎస్టీ కాలనీ విద్యార్థులకు బస్సు సౌకర్యం



గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

చిట్వేలి : మైలపల్లి పంచాయతీ వైఎస్సార్ ఎస్టీ కాలనీకి విద్యార్థుల సౌకర్యార్థం సోమవారం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. ఈ గ్రామం నుంచి సుమారు 12 మంది విద్యార్థులు ప్రతిరోజూ చిట్వేలి ఉన్నత పాఠశాలకు ఆటోలలో వెళ్లేవారు. రోజూ ఆటో చార్జీలు భరించలేక తల్లిదండ్రులు విద్యార్థులను బడికి నిలిపివేశారు. విషయం తెలుసుకున్న రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహులు, మైనలపల్లి గ్రామ నాయకులు యానాదిరాజులు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారు. అలాగే మండల విద్యాశాఖ అధికారులు కోదండ నాయుడు, ఈశ్వరయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజులు గ్రామానికి బస్సు రావడానికి తమవంతు కృషి చేసినందుకు గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో అధ్వానంగా సౌకర్యాలు



సమస్యలు తెలుసుకుంటున్న విద్యార్థి నాయకులు

రాజంపేట టౌన్ : రాజంపేటలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ షేక్ జుబేర్ తెలిపారు. పట్టణంలోని వసతి గృహాలను సోమవారం విద్యార్థి విభాగం ప్రతినిధులు పరిశీలించారు. అలాగే హాస్టల్ విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ ఏ హాస్టల్‌లోనూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించడం లేదని ఆరోపించారు. పలు హాస్టల్స్‌లో కిటికీలు దెబ్బతిని ఉండటంతో దోమల బెడద వల్ల విద్యార్థులు కంటినిండా నిద్రకు కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న కొన్ని వసతిగృహాల్లో స్లాబు పెచ్చులూడి కిందపడుతున్నాయన్నారు. వత్తలూరు రోడ్డులో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉందని, ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి హాస్టల్‌ను తాత్కాలికంగా ప్రైవేట్ భవనాల్లోకైనా తరలించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో సిబ్బంది కొరత ఉందని, వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి సిబ్బంది కొరత తీర్చాలన్నారు. హాస్టళ్ల పరిస్థితిని ప్రతినెల సమీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రతినిధులు ఇర్ఫాన్, శివ, బాల్‌రెడ్డి, జీవన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సహకారం అందించడమే ధ్యేయం



సుధాకర్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు సహకారం అందించడమే తమ ధ్యేయమని ఆల్ఫా మెరైన్ వ్యవస్థాపకులు దూడల సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు రూ. 24 లక్షలు విలువచేసే కంప్యూటర్‌లు అందించారు. ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ తన స్వగ్రామం పున్నాటివారిపల్లి అని, తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు సహకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కళాశాలలో కంప్యూటర్ల కొరత ఉందని తెలిసి దాదాపు 44 కంప్యూటర్లను అందజేశామన్నారు. తమ సంస్థ ద్వారా రైల్వేకోడూరు, రెడ్డివారిపల్లి, వైకోట, ఓబులవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ప్రిన్సిపల్ దేవరాజు మాట్లాడుతూ కళాశాలకు సుధాకర్ యాదవ్ 41 కంప్యూటర్లతోపాటు కెమిస్ట్రీ ల్యాబ్‌కు రూ.లక్ష, క్రీడా సామగ్రి కొనుగోలుకు మరో రూ.50 వేలు అందించారని చెప్పారు. ఇందుకు సుధాకర్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డిలు ల్యాబ్‌లను ప్రారంభించారు. అనంతరం సుధాకర్ యాదవ్‌ను మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్‌పీ జైపాల్‌రెడ్డి, స్థానిక నాయకుడు పున్నాటి వాసుదేవరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, పున్నాటివారిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: పుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

చంద్రబాబు మోసాలు.. ప్రజలకు శాపాలు



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : చంద్రబాబు మోసాలు.. ప్రజలకు శాపాలుగా మారాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణ పరిధిలో నూరానీ మజీద్, మహమ్మద్‌పూరా మజీద్, బడి కరిమియా మజీద్ ప్రాంతాలలో చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్యూఆర్ కోడ్ డౌన్ లోడ్ చేయించి, స్కాన్ చేసి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ కార్యకర్తలు, నాయకులకు వివరించారు.

కూటమి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చెప్పుతూ వీధివీధి తిరుగుతూ ఆ ప్రాంతంలోని ప్రజలను పేరుపేరున ఆత్మీయంగా పలకరిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శ్రీకాంత్ రెడ్డి వెంట యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు ఇటీవల ఎదురైన నీటి కష్టాలను ఆయన దృష్టి తీసుకెళ్లారు. సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ హయాంలో ఎలా ఉన్నాయి.. ఇప్పుడు ఎంత వరకు అందుతున్నాయో అని శ్రీకాంత్‌రెడ్డి వాకబు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రం అయిన తరువాత శ్రీకాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ప్రస్తుతం జరుగుతున్న నిర్లక్ష్యాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ఏమీ జరగడం లేదని స్థానికులు వాపోయారు. జగన్ పాలనలో వలంటీర్ల వల్ల ఇంటికే సర్టిఫికెట్‌లు అందేవని, ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ తిరిగిన పనులు కావడంలేదని ప్రజలు తమ ఆవేదనను తెలియజేశారు. పలువురు పింఛన్ల కష్టాలను మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మైనార్టీ జిల్లా అధ్యక్షులు బేపారీ మహమ్మద్ ఖాన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాషా, జాఫర్ ఆలీఖాన్, సీనియర్ నాయకులు జాకీర్, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, సాదిక్ అలీ, షబ్బీర్, గౌస్ ఖాన్, అల్తాఫ్ జాఫర్ అలీఖాన్, అన్నా సలీం, అబుజర్, రియాజూర్ రహిమాన్, తాజ్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్, శశిధర్‌రెడ్డి, సుగవాసి శ్యామ్, నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షులు జానం రవీంద్ర యాదవ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి శిబ్యాల విజయ భాస్కర్, రోటరీ హుస్సేన్, నవాజ్ క్రిష్, అమీర్, ఇనాముల్లా, ఖాదర్ వలీ, ఖలీల్, అజ్మతుల్లా ఖాన్, కో–ఆప్షన్ ఖాదర్ వలీ, ఫైరోజ్ , సాదక్ ఆలీ, అంజాద్ అలీ, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి గన్‌మెన్ సస్పెన్షన్ అన్యాయం



ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

వీరబల్లి : రాష్ట్ర మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మెన్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం అన్యాయమని వీరబల్లి మండల ఎంపీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టులో భాగంగా రాజమండ్రి జైలులో జుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ములాఖత్ అవ్వడానికి వెళుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డికి గన్‌మెన్ సహకరించినందుకు ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఎంత నీచానికైనా దిగజారి ప్రజాస్వామ్య విలువలను మంటలో కలుపుతూ ఇటువంటి దుర్మార్గ పనులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కూటమి నాయకుల దాష్టికాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఎదురుదెబ్బ తప్పక తగులుతుందని తెలియజేశారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదు



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ స్వాతి

రాయచోటి టౌన్ : ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ టి.స్వాతి చెప్పారు. సోమవారం శ్రీ భారతీయ విద్యా భవన్, సన్ రైజ్ స్కూల్‌లో విద్యార్థులకు పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి కేవలం అంటించుకునేది మాత్రమే కానీ అంటువ్యాధి కాదన్నారు. ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుందో.. ఎలా వ్యాపించదో వివరించారు. అలాగే మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుప్రజ, శ్రావణి, రామాంజనేయుల రెడ్డి, ప్రసాద్, రజియా, పీసీఎస్ఎస్ ఓఆర్‌డబ్ల్యుఎస్ సుహాసిని, అంజనమ్మ, పీటీ సంపూర్ణ, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సెల్‌కు హాజరుకావాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ అమరేశ్వరి

పెనగలూరు : ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌కు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తహసీల్దార్ అమరేశ్వరి అన్నారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు రెవెన్యూ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో గ్రీవెన్స్‌లో ఎవరైనా అర్జీలు పెట్టుకుంటే ఉన్నతాధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే జిల్లాతోపాటు మండలంలో వచ్చే అర్జీలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని సూచించారు. అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, వీఆర్‌ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నందలూరు: పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు



రాయచోటి టౌన్: వీరభద్రస్వామి ఆలయంలో పుట్ట వద్దకు వెళుతున్న భక్తులు

రాజంపేట టౌన్/రాయచోటి టౌన్ : నాగుల చవితిని పురస్కరించుకుని సోమవారం వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు వేకువజామున పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. తొలుత పుట్టల్లో పాలుపోసి నాగేంద్రుడికి ఉపవాసం చెప్పారు. అనంతరం ఇంటివద్ద పిండివంటలు చేసుకొని పుట్టల వద్ద ఉంచి నాగేంద్రుడికి నైవేద్యంగా పెట్టారు. నాగుల చవితిని పురస్కరించుకొని పుట్టల వద్ద మహిళల సందడి కనిపించింది. రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో మహిళలు పాల్గొని పుట్టకు పూజలు జరిపారు.